
# ముందుచూపు

కథ

-ఎస్.తారక రామారావు

"ముందు చూపున్న" రామబ్రహ్మంగారంటే నాకు గురువూ, దైవం అన్నీనూ! ఎందుకంటే మా నాన్నగారి స్నేహితుడు. నా బియ్యే అయిపోగానే పై చదువులకు పోవాలని ఆశపడితే, రామబ్రహ్మంగారు నన్ను చేరదీసి...

"ఎమ్మే చదువుతావు బాగుంది. ఆ తర్వాత ఉద్యోగ ప్రయత్నం చేస్తావు కదా. ఓ రెండేళ్ల తర్వాత చేసే ఉద్యోగ ప్రయత్నమేదో ఇప్పుడే చేస్తే....ఆలోచించు.." అన్నారు.



''నా డిగ్రీకి ఉద్యోగం వస్తుందా?'' అన్న నా సందేహానికి...

రామబ్రహ్మంగారు చిద్విలాసంగా నవ్వి, తాపీగా సిగరెట్ తాగి, ''అబ్బాయి, ఎమ్మే చదివితే ఉద్యోగం వస్తుందన్న నమ్మకం ఏమిటి?'' అని ప్రశ్నించారు. ఆనక సమాధానం కూడా ఆయనే చెప్పారు.

''ఉద్యోగాలు డిగ్రీలకు రావు. పలుకుబడి వుండాలి'' అని చెప్పి, ''నే ప్రయత్నిస్తా'' అంటూ ఓ స్కూల్లో గుమస్తాగా వేయించారు.

రామబ్రహ్మంగారి సహాయానికి నేను సర్వదా కృతజ్ఞుడిగా వుండిపోకుండా, గుమాస్తాగా స్కూలు పని అయిపోయాక, వారి వ్యాపార విషయాల్లో నాకు తోచిన సహాయం చేసేవాడిని. ఆయనంటే గిట్టని వారు నాకు చేసింది సహాయం కాదు, స్వార్థం అంతే, జీతం, బత్తెం లేకుండా గుమాస్తా దొరికాడు అనేవారు. నేను వాటిని నమ్మను. అది వారి ఓర్వలేని తనం అని సరిపెట్టుకునేవాడిని.

రామబ్రహ్మంగారి ముందు చూపు గురించి చెప్పకుండా, నా స్వంత విషయాలు చెబుతున్నా గదూ! క్షమించండి. అందుకే మొదటే చెప్పాను ఆయన నాకు గురువు, దైవం అని. రామబ్రహ్మం గారు పదేళ్ల తర్వాత రాబోయే పరిణామాలు ముందుగా పసిగట్టగలరు. అది ఆయన ప్రత్యేకత. ఫలానా నీటి పారుదల ప్రాజెక్టు ఊహకందని రోజుల్లో ఆయన భూములు కొన్నారు. కొన్న రైతులకు ఉదారంగా ఆ భూమి సాగుచేసు కొమ్మని, మీకు పదొస్తే నాకో రూపాయి ఇవ్వండిరా అని చెప్పారు. పదేళ్ల తర్వాత ప్రాజక్టు వచ్చి ఆభూమిలో ఫలసాయం బాగా వచ్చాక ఆ భూములు వారే అమ్ముకున్నారు. అది వేరే సంగతి.

అలాగే పట్టణంలో ఖాళీ భూములు కొని, ఊళ్లో స్థలాలకు బాగా గిరాకీ వచ్చాక, ఎక్కువ రేటుకు అమ్ముకున్నారు. ఇలా రామబ్రహ్మంగారికి ముందు చూపు జాస్తి. ఆ ముందు చూపుతోనే రెండు పెట్రోలు బంకులు, సినిమా హాలు, పది ఆటోలు, ఊళ్లో నాలుగు ఇళ్లు సంపాదించారు. అంతా స్వార్జితం.

''నాదేముందిరా? కష్టపడ్డా, నిజాయితీగా పనిచేశా! ఆపై వాడు కనికరించాడు. అంతే!'' అని నిర్మొహమాటంగా మనసులోని మాట నాతో చెబుతుండేవారు. డబ్బుందన్న గర్వం ఏ కోశానా లేదు. అదీ ఆయన గొప్పతనం.

స్కూలులో గుమాస్తాగా నేను కుదురుకున్నాక, ఓరేయ్! స్కూలయ్యాక సినిమాకో, షికార్లకో తిరగక- వచ్చి మా ఆఫీసులో కూర్చో. నీకూ కాలక్షేపం. నాకూ నీలాంటి ఆత్మీయుడు ఎదురుగా వుంటే మంచీ చెడూ మనసు విప్పి చెప్పుకోవచ్చు. అంటే నేనెలా కాదనగలను? ఆయనతో పాటు కాఫీ, టిఫిన్లు కాక, అప్పుడప్పుడు సినిమాహాల్లో ఉచిత ప్రవేశం, ఊళ్లో ఫలానా రామబ్రహ్మంగారి మనిషన్న మర్యాద, గుర్తింపు లభించాయి ఆయాచితంగా.

రామబ్రహ్మంగారికి ఇద్దరు భార్యలు. కనుక ఆయన జీవితం కత్తిమీద సాము లాంటిది. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ చెయ్యకపోయినా, సవతుల మధ్య సమతౌల్యం సాధించడం అసాధ్యం. ఆ అసాధ్యాన్ని, సుసాధ్యం చేసేపనికి, నేను ఉపయోగపడేది. అంటే, ఏ ఇంటికి ఏం పంపాలన్నా, కబురు, డబ్బు, వస్తుసామాగ్రి ఏదైనా నాద్వారా జరగడం వల్ల ఆయనకు కొంత వెసులుబాటు దొరికేది. పైగా నా అంత నమ్మకస్తుడు దొరకడం ఆయనకు బాగా లాభించేది. ఇంకో విషయం చెప్పాలి. ఇక్కడ చిన్నావిడకు ముగ్గురూ ఆడపిల్లలే. చిన్నావిడకు మూడో ఆడపిల్ల పుట్టిన తరువాత పెద్దావిడకు, ఓ కొడుకు పుట్టాడు. విషయం మీలాంటి వారికి ఈపాటికి అర్థమయ్యే వుంటుంది. పిల్లల్లేరని రెండో పెళ్లి చేసుకుంటే అక్కడ అందరూ ఆడపిల్లలే. ఇక నా బ్రతుకు ఇంతే అని నిరాశతో వున్న పెద్దావిడకు మగపిల్లవాడు పుట్టడం వల్ల రామబ్రహ్మం గారి ముందు చూపు కొంత మసకబారింది.

మరో విషయం ఏమంటే, రామబ్రహ్మంగారి వారసుడు అనంతం సుమారు నా వయస్సు వాడే. నాతో పాటే చదివాడు. అతగాడికి మార్కులు బొటాబొటిగా వచ్చేవి. ప్రతి తరగతిలోనూ పైకి నెట్టడమే. నాకు ఫస్టు మార్కులొస్తే, అనంతం క్లాసులో చివరివాడిగే వుండేవాడు. ఈ కారణాల వల్ల కూడా నేను రామబ్రహ్మంగారి ఆదరణకు నోచుకున్నాను.

అనంతం చదువులో వెనకబడ్డా, ఖర్చులో, జల్సాల్లో, అల్లరిలో అన్నింటా ముందుండేవాడు. ''నాయనా కాస్త మావాడిని కనిపెట్టుకోనుండు. నీలాంటి బుద్ధిమంతుడితో స్నేహం చేస్తేనన్నా వాడు తెలివిన బడతాడేమో!''అని రామబ్రహ్మం గారి అంతరంగం. ఓ రకంగా ఆజ్ఞ.

ఇలా నన్ను తన ఆంతరంగికుడిగా స్వీకరించడం వల్ల రామబ్రహ్మంగారికొచ్చిన నష్టం ఏమిటో నాకు తెలియదు కానీ నా భవిష్యత్తును తన స్వార్థం కోసం మంటకలిపాడని గిట్టని వాళ్లు అంటారు. అదెంతవరకు నిజమో నాకు తెలియదు. ఎందుకంటే రామబ్రహ్మంగారు నాకు గురువు, దైవం.

ఇక అసలు విషయానికి వస్తే, అనంతం పెళ్లి విషయంలో, రామబ్రహ్మంగారు తీసుకున్న నిర్ణయం చాలా మందికి అంతు చిక్కలా. కొన్నాళ్లకు నాక్కూడా. అందం ఎన్నాళ్లు? ఒకరో ఇద్దరో పుట్టేదాకా. ఆ తర్వాత. రంభ అయినా అన్నీ వడలిపోయి, జారిపోయి ఈసురోమంటు వుంటారు! రామబ్రహ్మంగారి వాదన ఇది.

''అమ్మాయి ఒక్కతే. ఏలెక్కన చూసుకున్నా, ఎంత అంచనా తక్కువ వేసుకున్నా పది కోట్ల ఆస్తి. ఎన్నాళ్లు కష్టపడితే అంత ఆస్తి కలిసిసొస్తుంది'' ఇది రామబ్రహ్మంగారి ముందుచూపు.


''అనంతం అమ్మాయిని చూసి బాగాలేదని అన్నాడు కదండి!'' నా ప్రశ్న.

రామబ్రహ్మంగారు చిద్విలాసంగా నవ్వారు. అంటే... బ్రహ్మాస్త్రం ప్రయోగించబోతున్నారన్న మాట. ''నిజమే! వాడికి నచ్చలేదు. నే పిల్లలు పుట్టకపోతే ఏం చేశాను? మరో పెళ్లి చేసుకున్నా. అనంతానికి నువ్వు నచ్చచెప్పు. అవసరం అనిపిస్తే మరో అమ్మాయిని, నచ్చినదాన్ని చేసుకోమను.''

నేనోర్రెళ్లబెట్టా ఆయన ఆలోచనలకు.

''అయినా, ఈ పిల్లకు డబ్బుతో పాటు జబ్బుంది. ఎన్నేళ్లు వచ్చినా తగ్గని జబ్బు. ఇక తగ్గుతుందని నాకేం నమ్మకం లేదు. ఆ అమ్మాయి పోతే ఆ తర్వాత ఆస్తి వస్తుంది. కావలసి వస్తే ఆ వుంచుకున్నదాన్నే తెచ్చుకోమను.''

అనంతం పెళ్లి రంగరంగ వైభవంగా జరిగింది. విందులు, వినోదాలు, ఊరేగింపులు, మర్యాదలు అన్నీ ఘనంగా జరిగాయి. నాక్కూడా. పెళ్లికొచ్చిన



ప్రతి ఒక్కరూ 'గడకర్రకు చీర కట్టినట్లుంది పెళ్లికూతురు' అన్నారు. రామబ్రహ్మం డబ్బు కోసం కొడుకు గొంతు కోసాడన్నారు గిట్టని వాళ్లు.

రామబ్రహ్మంగారి ఇల్లాలు ''ఆయన అనుకుంటే బ్రహ్మరుద్రాదులు అడ్డొచ్చినా ఆయన మాట నెగ్గాల్సిందే. ఇదంతా నా ప్రారబ్ధం'' అని వాపోయింది ఆత్మీయుల దగ్గర.

పెళ్లయిన తర్వాత అనంతం విజృంభించాడు. పగలంతా క్లబ్బు, గుర్రప్పందాలు, రాత్రి మందు, విందు. ఏ అర్ధరాత్రో, అపరాత్రో కొంప చేరడం. అనంతం తోడుగా నేను వుండక తప్పని స్థితి. దాంతో నాక్కూడా కొన్ని కొన్ని అలవాట్లు అబ్బాయి. అనంతం భార్య సుందరి మహా ఇల్లాలు. ఓ మాట మాట్లాడదు. కళ్లల్లో, మొహంలో ఏ భావమూ వ్యక్తం చేయదు. ఎప్పుడన్నా నాతో 'ఆయన ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమను' అని చెప్పేది. రామబ్రహ్మంగారు జీవితంలో అన్నీ అనుకున్నట్లు సాధించారు. చిన భార్య కూతుళ్లు కోతుల్లా వున్నా మంచి సంబంధాలు చూసి చేశారు. వున్న ఒక్కగానొక్క కొడుక్కి తరగని ఆస్తిగల పిల్లను భార్యగా తెచ్చి, నిధి చాలా సుఖము సుమా అని లోకానికి తెలియజెప్పారు.

నేను, స్కూలులో గుమాస్తాగిరి, ఆనక అనంతంతో తిని, తిరగడం. కొన్నాళ్లయేసరికి...

రామబ్రహ్మంగారు, నన్ను పిల్చి, రహస్యంగా ''అమ్మాయి నెల తప్పింది'' అన్నారు బ్రహ్మ రహస్యం చెప్పినట్లు. వారసుడొస్తున్నాడు అని సంబరపడ్డారు. ఒంట్లో చెంచాడు మాంసం కానీ, కళ్లల్లో ఏమాత్రం జీవం లేని, సుందరి నెలతప్పడం ఏమిటి? అనంతం పెళ్లయ్యాక ఏరోజు అర్ధరాత్రి దాటక ముందు కొంపకు చేరిన దాఖలాల్లు లేవు. భార్యతో షికార్లు, సినిమాలు, సరదాలు చేసిన సంఘటనలు అరుదు. అనంతం భార్య సుందరిని పుట్టింటి వారు తీసుకెళ్లారు. వాళ్లకు ఒక్కగానొక్క కూతురు. నడిస్తే, కూచుంటే ఎక్కడ కందిపోతుందో అన్నంత అపురూపంగా చూసుకుంటున్నారు.

అనంతానికి మరీ స్వేచ్ఛ లభించింది. కట్టు తెంచుకున్న కోడెదూడలా బరితెగించాడు. సుఖాల ఉప్పెనలో చిక్కుకున్నాడు. నేను, అతగాడి లీలలకు సాక్షీభూతుడిని మాత్రమే.

రోజులు గడుస్తున్నాయి.

ఓ తెల్లవారుఝామున అనంతం గుండె ఆగి చచ్చిపోయాడని కబురొచ్చింది.

నిస్తేజుడయ్యాను.

రామబ్రహ్మంగారు శిలలా అయ్యారు. ఆయన భార్య శోకం వర్ణించడానికి చెప్పనలవిగాదు. రంగు రంగుల గాలిపటం దారం తెగి ఆకాశంలో ఎగిరిపోయినట్లు, రామబ్రహ్మంగారి జీవితం గాఢాంధకారం అయిపోయింది. ఆయన ఆశలు, కోరికలు, ముందు చూపు కాలి బూడిదైపోయాయి. ఇలా జరుగుతుందని ఎవరు ఊహించగలరు?

నాకు రామబ్రహ్మంగారు ఇప్పుడు గురువు, దైవం కాదు. ఆయన ముందుచూపు పూర్తిగా మందగించిందనిపించింది. అనంతం జీవితం ఇలా అర్ధంతరంగా ముగిసిపోవడానికి రామబ్రహ్మం గారి ముందుచూపే కారణమేమో అని నాకు అనిపించింది. ఆశ మంచిదే కానీ...రామబ్రహ్మం అత్యాశకు పొయ్యాడేమో అనిపించింది.

నా గుమాస్తా గిరి నిరాటంకంగా చేసుకుంటున్నా. రామబ్రహ్మంగారి పిలుపుకు ప్రతిస్పందించడం మానుకున్నా. అసలా ఛాయలకే పోవడం మానుకున్నా.

ఓరోజు ఎవరో చెప్పగా విన్నా రామబ్రహ్మం గారి కోడలు, అనంతం భార్య ఆడపిల్లను కన్నదని, తల్లీ పిల్లా క్షేమం. రామబ్రహ్మంగారిని ఓసారి చూడాలనిపించింది. కానీ వెళ్లలా, నాకూ ముందు చూపు అలవడింది ఆయన సాంగత్యంలో.

❐



## పున్నమి నాగు

ఐటెంగర్ల్‌గా ఎంట్రీ ఇచ్చిన ముమైత్‌ఖాన్ అంచెలంచెలుగా హీరోయిన్‌గా ఎదిగింది. 'మైసమ్మ జిందాబాద్'లాంటి మాస్ చిత్రాల్లో నటించింది. ఇప్పుడు తాజాగా 'పున్నమినాగు'గా మన ముందుకు వస్తోంది. సినీ చరిత్రలో 'నాగుపాము' నేపథ్యంతో వచ్చిన సినిమాలన్నీ సూపర్ డూపర్ హిట్‌లే! 80వ దశకంలో మెగాస్టార్ చిరంజీవి నటించిన 'పున్నమి నాగు' ఎంతటి సంచలన విజయం సాధించిందో మనకు తెలియనిది కాదు. ఒక రకంగా చెప్పాలంటే చిరంజీవికి మొదట బ్రేక్‌నిచ్చింది 'పున్నమినాగు' చిత్రమే. ఆ తరువాత చాలా సినిమాలు నాగుపాము నేపథ్యంలో వచ్చాయి. మంచి హిట్‌లు సాధించాయి. ఇప్పుడు అదే రేంజ్‌లో ముమైత్ 'పున్నమి నాగు' హిట్ సాధిస్తుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సెన్సేషనల్ డైరెక్టర్ ఎ. కోదండరామిరెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మరో వైపు చిరంజీవి నటించిన చాలా చిత్రాలకు స్క్రిప్టు రాసిన యండమూరి వీరేంద్రనాథ్ కథను అందిస్తున్నారు. ఈ సినిమాకు స్క్రిప్టు రాస్తున్నారు. తెలుగు చలన చిత్రాల్లో సంచలన విజయాలు సృష్టించిన వీరిద్దరి కలయికలో ఈ చిత్రం రూపుదిద్దుకోవడం విశేషం. 'పున్నమినాగు' ముమైత్‌కు మంచి పేరు తెస్తుందని పలువురు అంటున్నారు. రిలీజయ్యాక తెలుస్తుంది అసలు సంగతి!